

ఎంత వరదొచ్చినా.. ఇక అమరావతి సేఫ్

నీరుకొండ వద్ద భారీ జలాశయం నిర్మించనున్న ప్రాంతమిదే



- తొలిదశలో రూ. 1,237 కోట్ల వ్యయం
- మొత్తం ఆరు రిజర్వాయర్ల ఏర్పాటు
- వరద జలాలను ఎత్తిపోసేందుకు మూడు లిఫ్టులు
- 2026 చివరి నాటికి తొలిదశ పనులు పూర్తి
- సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్

ప్రపంచంలోని ఐదు మేటి నగరాల్లో ఒకటిగా ఉండాలన్న ఆశయంతో పటిష్టమైన పునాదులతో రాజధాని అమరావతి నిర్మితమవుతోంది. అయితే దీనికున్న ఒకే ఒక సమస్య వరద ముంపు.. ఇదే సమస్యను నగరానికి చాలా పెద్ద అనుకూలాంశంగా మార్చుకుంటూ పక్కా ప్రణాళికలతో అమరావతిని మలుస్తున్నారు. సంక్షోభాలను కూడా అనుకూలాంశాలుగా మార్చుకుని ముందుకు సాగడం చంద్రబాబు పద్ధతి. ఇప్పటి వరకు కొందరు ఏదైతే ముప్పని అంటున్నారో అదే సమస్యను రాజధానికి ఓ పెద్ద వరంగా మార్చి చూపేందుకు అద్భుతమైన ప్రణాళికను బ్రహ్మాండంగా ఆయన అమలు చేస్తున్నారు.

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

అమరావతికి కొండవీటివాగు ముంపు సమస్య చాలా తీవ్రమైంది. దీంతోపాటే పాలవాగు, కొట్టేళ్లవాగు తదితరాలు కూడ. వీటిలో ప్రధానమైన కొండవీటి వాగు పేరేచర్ల కొండలలో పుట్టి 28 కి.మీలు ప్రయాణించి ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా హెడ్ రెగ్యులేటర్ స్లూయాస్‌ల వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఈ వాగు పరీవాహక ప్రాంతంలో ఎక్కువ భాగం ప్రస్తుత రాజధాని అమరావతిలోనే ఉంది. భారీ వర్షాల నేపథ్యంలో కొండవీటి వాగు నుంచి వరద నీరు వచ్చి ఎగువ కృష్ణా నదిలో కలుస్తుంది. కృష్ణానదికి వాగుకు మధ్య లాకులు ఉన్నాయి. కొండవీటి వాగు వరద నీరు నదిలోకి వెళ్లేందుకు ఈ లాకులను ఎత్తడంతో నీరు నదిలోకి మళ్లిపోతుంది. కానీ...ఇదే సందర్భంలో కృష్ణానదికి పైనుంచి వరద నీరు మూడు లక్షల క్యూసెక్కులకు మించి వచ్చిందంటే వరదనీరు కొండవీటి వాగులోకి విరుచుకుపడుతుంది. కొండవీటి వాగులో నిత్యం గుర్రపుడెక్కాకు, తూటికాడ ఏపుగా పెరుగుతూ పూడిక వేస్తుంటాయి. దీంతో వాగులో నీరు ముందుకు ప్రవహించడం కష్టసాధ్యమై కట్టలు తెగి సమీప ప్రాంతాలను ముంచెత్తుతుంది. పాలవాగు కూడ కృష్ణాయపాలెం వద్ద ఇతర వాగులతో కలిసి వచ్చి కొండవీటి వాగులో కలుస్తుంది. ఈ సమస్యను

(మిగతా 4లో)



పెనుమాక వద్ద నిర్మించనున్న జలాశయ ప్రాంతమిదే

రెండుదశల్లో వరద మళ్లింపు పథకాలు



నెక్కల్లు-పిచ్చుకలపాలెం మధ్య నిర్మిస్తున్న గ్రావిటీ కెనాల్ (రెండోదశ పథకంలోనిది)

నెదర్లాండ్స్ విధానంతో ముందుకు

ప్రధానంగా ఎగువ కృష్ణలోకి వాగు వరద నీటిని లాకుల ద్వారా తరలించడమన్నది అసాధ్యమన్న సంగతిని సీఎం చంద్రబాబు గుర్తించారు. అందుకే ఈ సమస్యను గురించి నిపుణులతో సమగ్రంగా అధ్యయనం చేయించి దీనికి నెదర్లాండ్స్ విధానాలే అసలైన పరిష్కార మార్గాలుగా తేల్చేశారు. ప్రస్తుతం చిందరవందరగా ఉన్న వాగులు వంకలను ఓ క్రమపద్ధతిలో ప్రవహించేలా చేసి కొత్త ప్రవాహ రూపాలనిస్తూ వాటిని మధ్యమధ్యలో బ్యాలెన్స్‌డ్ రిజర్వాయర్లతో అనుసంధానించేలా నెదర్లాండ్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని అమరావతి నీటి అవసరాలు తీరేలా వరద జలాలను వృథా పోనివ్వకుండా వాటన్నింటిని రిజర్వాయర్ల రూపంలో నిల్వచేసి భూగర్భ జలాలు పెరిగేలా.. రిజర్వాయర్లను ఒకదానితో ఇంకోటి అనుసంధానిస్తూ ఓవర్‌ఫ్లో అయ్యే నీటిని తరలించేలా ప్రణాళికలను రూపొందించారు. కాలువలను సుందరీకరించి వాటి తీరాలలో పార్కులు, రిసార్టులు వంటి వాటిని ఏర్పాటుచేయడం, కాలువల్లో నావిగేషన్ సౌకర్యాలను కల్పించడం వంటి చర్యలతో పర్యాటకాభివృద్ధి జరిగి వాటి నిర్వహణకయ్యే ఖర్చులను సునాయాసంగా రాబట్టేలా పథకం వేశారు.

అనుసంధానంగా హైవేలు

నిజాంపట్నం పోర్టు కనెక్టివిటీకి గ్రీన్‌ఫీల్డ్ హైవే

- రూ.1400 కోట్ల అంచనాతో ఎలైన్‌మెంట్ సిద్ధం
- కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదన
- వినుకొండ-గుంటూరు, తెనాలి-చినకాకాని, నారాకోడూరు-ఎన్‌హెచ్-16లకూ..

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని జిల్లా కేంద్రమైన గుంటూరుతో, నిజాంపట్నం పోర్టుతో మరిన్ని ప్రాంతాలు అనుసంధానమయ్యేలా.. వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చేలా.. ఎగుమతులు, దిగుమతులుకు మార్గం సుగమం చేసేలా హైవేలకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ప్రతిపాదనలను రూపొందించింది. ఈ క్రమంలో నిజాంపట్నం పోర్టుని జాతీయ రహదారులతో అనుసంధానం చేసే ప్రాజెక్టును కేంద్రానికి ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. నారాకోడూరు నుంచి నిజాంపట్నం వరకు నిర్మించే నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎలైన్‌మెంట్ రూపకల్పన జరిగింది. అయితే కేంద్రం ఆమోదించిన తర్వాతనే దానిని పోర్టల్‌లో అప్‌లోడింగ్ చేసి భూసేకరణ ప్రక్రియని ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. దీనివల్ల నిజాంపట్నం పోర్టుకు ఎగుమతులు, అక్కడికి



దిగుమతులు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ప్రతిపాదిత పోర్టు కనెక్టివిటీ ప్రాజెక్టు అమరావతి రాజధాని ఔటర్ రింగురోడ్డుతో పాటు ఎన్‌హెచ్-16కి కూడా లింకవుతుంది. పోర్టుల అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిజాంపట్నం పోర్టుని కూడా అభివృద్ధి చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే ఈ పోర్టుకు ఇప్పటి వరకు సరైన కనెక్టివిటీ లేదు. వాన్‌పిక్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చి ఉంటే నిజాంపట్నం పోర్టుకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరేది. అయితే ఆ ప్రాజెక్టు సీబీఐ కేసులతో అటకెక్కింది. ఈ నేపథ్యంలో నిజాంపట్నం పోర్టుకు సరైన రోడ్డు కనెక్టివిటీని కల్పించడం ద్వారా మత్స్య ఉత్పత్తుల ఎగుమ తులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జాతీయ రహదారులను అనుసందానిస్తూ రహదారి నిర్మాణం చేపట్టాలని ఎన్‌హెచ్‌ఏఐని కోరింది. ఆ మేరకు రూ.1400 కోట్ల అంచనాతో ఆ సంస్థ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. దీనికి కేంద్రం ఆమోదిస్తే ఎన్‌హెచ్ నంబరు వస్తుంది. ఆ తర్వాత భూసేకరణ, నిర్మాణ ప్రక్రియ ప్రారంభమౌతుంది.

మరో రెండు ప్రాజెక్టులూ..

మరో రెండు ప్రాజెక్టులను కూడా ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదించింది. అందులో ఒకటి చినకాకాని జంక్షన్ నుంచి తెనాలి వరకు ఆరు వరసల జాతీయ రహదారి. దీని పొడవు 17.4 కిలోమీటర్ల వరకు ఉంటుంది. మరొకటి నారాకోడూరు- ఎన్‌హెచ్ 16 సెక్షన్. ఇది ఐదు కిలో మీటర్ల దూరం పైగా ఉంటుందని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు. అలానే వినుకొండ - గుంటూరు జాతీయ రహదారిని నాలుగు వరసలుగా అభివృద్ధి చేసే ప్రాజెక్టుని కూడా ప్రతి పాదించినట్లు పేర్కొన్నారు. దీనికి పరిపాలన అనుమతి రావాల్సి ఉందన్నారు. కేంద్రం నుంచి అ నుమతులు రాగానే అన్ని రోడ్డు ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయులకు సాంస్కృతిక పోటీలు

పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహణ

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో వచ్చే నెల 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం నిర్వాహకులు తెలిపారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో పోటీలకు సంబంధించి బ్రోచర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల ప్రాంగణంలో పోటీలు జరుగుతాయన్నారు. శాస్త్రీయ నృత్యం, నాటికలు, దేశభక్తి గీతాలు, బుర్రకథలు, మైమ్, ఏకపాత్రాభినయం, కోలాటం, పద్య, కవితలు వంటి అంశాలలో పోటీలు ఉంటాయన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈ నెల 26వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బాలోత్సవం నిర్వాహకులు షేక్ మస్తాన్‌షరీఫ్, కొల్లి బ్రహ్మయ్య, కట్టా కోటేశ్వరరావు, కోయ రామారావు, కామినేని రామారావు, మద్దూరి మోహనరావు, ఎం.సాంబశివ రావు, ఏ భాగేశ్వరీదేవి, నెల్లూరి బ్రహ్మయ్య, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బాలోత్సవం నిర్వాహకులు

ఆసక్తి కరంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు 4

అమ్మ చెరవాణి బంధం.. విలపిస్తున్న పేగుబంధం!

- వివాహితకు భర్తతో విభేదాలు..
- ఇద్దరు పిల్లలను వదిలేసి.. ప్రియుడి కోసం పిడుగురాళ్లకు..
- అమ్మ ఎక్కడంటూ పోలీస్‌స్టేషన్‌లో చిన్నారులు

- తొమ్మిదేళ్లుగా సాగుతున్న నిర్మాణాలు
- సొంతింటి కల సాకారంపై పేదల నిరీక్షణ



వినుకొండ మున్సిపాలిటీలో పూర్తయిన గృహ సముదాయం


బొప్పూడిలో ఘనంగా నక్షత్ర వనమహోత్సవం

7



చిలకలూరిపేట మండలం బొప్పూడిలో నక్షత్ర వనమహోత్సవంలో పాల్గొన్న పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు

సాగర్ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు మూసివేత



విజయపురిసౌత్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైల నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరదనీరు తగ్గుముఖం పట్టింది. దీంతో ఆదివారం అధికారులు ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లను మూసివేశారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 10,040, ఎడమ కాల్వ ద్వారా 8896, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,901, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 55,537 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 63,398 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.01 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,54,210 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుండగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 16,600, లీకుల ద్వారా నాలుగు వందలు, రెండు గేట్ల ద్వారా 73,748, మొత్తం 90,748 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

టిడ్కోకు మోక్షమెప్పుడో?

వినుకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదల కొరకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణాలు చేపట్టింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం గృహాల నిర్మాణాలపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మిగిలిన నిర్మాణాలు పూర్తి చేసి సొంతింటి కలను నెరవేరుస్తుందని పేదలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొత్తం 12512 గృహాలకు 8192 గృహాలను పూర్తి చేసి పురపాలక సంఘాలకు అప్పగించగా మిగిలిన గృహాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. పూర్తిచేసిన గృహ సముదాయాలకు మౌలిక సదుపాయాలు కల్పనలో జాప్యం జరుగుతోంది. తొమ్మిదేళ్లుగా మొదటి విడతలో మంజూరైన ఇళ్లు నేటికీ పూర్తి కాకపోవడంపై లబ్ధిదారులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లిలో మాత్రమే కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించారు. పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ మున్సిపాలిటీలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ ఏజెన్సీలు ఖరారు చేయాల్సి ఉంది. పూర్తి అయిన గృహ సముదాయాలకు తాగునీటి, రోడ్లు, వీధిలైట్లు, మురికినీటి శుద్ధి ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. అధికారులు వీటికి టెండర్లు పిలిచామని చెబుతున్నా పనులు మాత్రం ఇప్పటికీ మొదలు కాలేదు. 2026 మార్చికి టిడ్కో గృహ సముదాయాలను అందుబాటులోకి తెస్తామని మంత్రి నారాయణ ప్రకటన ఎంతవరకు నెరవేరుతుందో చూడాలి.

మున్సిపాల్టీల వారీగా గృహాలు..

మున్సిపాల్టీ	మంజూరు	పూర్తి
చిలకలూరిపేట	5520	4512
సత్తెనపల్లి	–	160
నరసరావుపేట	1504	1504
పిడుగురాళ్ల	2832	1296
మాచర్ల	1056	0
వినుకొండ	1440	720

వీసీ హామీ.. హుళక్కి

- పూర్తి కాని వసతి గృహాల నిర్మాణం
- రూ.11.10 కోట్లు మంజూరులో అలసత్వం
- నరసరావుపేట జేఎన్‌టీయూపై అలుముకున్న నిర్లక్ష్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహా లను 2025-26 విద్యా సంవత్సరానికి వినియోగంలోకి తీసుకొస్తాం.. అక్టోబరు కల్లా విద్యార్థులకు వసతి కల్పిస్తాం.. అని జేఎన్‌టీయూ వీసీ మార్చిలో హామీ ఇచ్చారు. అయితే అక్టోబరు సమీపించినా ఆ హామీ అమలు కాలేదు. వసతిగృహాల నిర్మాణ పనులు నిధుల లేమితో ముందుకు సాగడంలేదు. రూ.11.10 కోట్లు మంజూరుకు సంబంధించి వర్సిటీ పాలకమండలి(ఈసీ) సమావేశంలో తీర్మానం చేయాల్సి ఉంది. అయితే ఈ సమావేశం నిర్వహించి విద్యార్థుల వసతి సమస్య పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు స్పందించడం లేదు. పాలకమండలిలో ఉన్నతాధికారులే సభ్యులుగా ఉన్నా పలుమార్లు వాయిదా వేసినట్లు సమాచారం.

ఆది నుంచి అలసత్వం..

పల్నాడు.. బాపట్ల జిల్లాల సరిహద్దులోని నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలపై ఆది నుంచి వర్సిటీ పెద్దలు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కళాశాల భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కనీసం వసతి గృహాలను పూర్త చేసేందుకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. నిధుల కేటాయింపుపై కమిటీలు ఆమోదం తెలిపినా నిధుల విడుదలపై పాలక మండలి తాత్సారం చేస్తోందన్న విమర్శలున్నాయి. వందలాది మంది విద్యార్థులు వసతి లేక అల్లాడుతున్నా వారి సమస్యలు పాలకవర్గానికి పట్టడంలేదు. ప్రభుత్వం కూడా కళాశాల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి. బాలుర వసతి గృహం ఒక భవన నిర్మాణం పూర్తికాగా స్వల్పంగా పనులు నిలిచిపోయాయి. ఫర్నిచర్ కూడా సమకుర్చారు. అయితే మరుగుదొడ్లకు సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం నిలిచిపోయింది. ఈ పని పూర్తి చేస్తే కనీసం బాలుర వసతికి ఒక భవనం అందుబాటులోకి వస్తుంది. సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేసి వసతి కల్పించాలని విద్యార్థులు కోరుతున్నా వారి మొర ఆలకించే వారే కరువయ్యారు. బాలికల వసతి గృహాలకు సంబంధించి తుది దశలో పనులు నెలల తరబడి నిలిచిపోయాయి.



బాలికల వసతి గృహ భవనాలు

రైల్వే ఉద్యోగుల పని ప్రదేశానికే.. హెల్త్ ఆన్ వీల్స్


సంచార వాహనంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

గుంటూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నిత్యం విధి నిర్వహణలో ఉంటూ.. ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తూ అనారోగ్యం భారిన పడుతున్న రైల్వే కార్మికుల పని ప్రదేశానికే.. హెల్త్ ఆన్ వీల్స్ రైలుని తీసుకెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం గుంటూరు - నడికుడి సెక్షన్‌లో ఈ సంచార రైలుని నడిపారు. మార్గమధ్యలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్లలో వాహనాన్ని నిలిపి.. అక్కడి రైల్వే కార్మికులు, వారి పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. దాదాపుగా 158 మంది సంచార వైద్య సేవలను వినియోగించుకొన్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ డీఎంవో డాక్టర్ వి.ప్రకాష్, డాక్టర్ బి.మహర్షి పాల్గొన్నారు.

ఆసక్తికరంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు


బండలాగుతున్న ఎడ్ల జత

క్రోసూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు ఆసక్తి కరంగా, ఉత్కంఠ భరితంగా జరుగుతున్నాయి. వివిధ జిల్లాలకు చెందిన ఎడ్ల జతలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. ఆదివారం నాలుగు పళ్ళ విభాగంలో ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పొట్లపాడుకు చెందిన మేడగం హర్ష వర్ధన్‌రెడ్డి ఎడ్ల జత 4,132.3 అడుగులు నిర్ణీత సమయంలో బండలాగి ప్రథమ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా పంగలూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్ల జత రెండవ స్థానంలోను, క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన కడియం మణికంఠ ఎడ్ల జత మూడవ స్థానంలోను నిలిచాయి. ప్రకాశం జిల్లా బెస్తావారిపేట బచినేపల్లికి చెందిన ఎడ్లకుండ్ల శ్రీనివాసులు, నరసరావుపేటకు చెందిన మనోజ్ చౌదరి, ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి, పెదకాకాణికి చెందిన ఆళ్ళ రాజేష్ యాదవ్, ప్రకాశం జిల్లా సీతారామపురం గ్రామానికి చెందిన పేరవరపు కార్తీక్ ఎడ్ల జతలు వరుసగా తరువాత స్థానాల్లో నిలిచాయి. ఆరు పళ్ళ విభాగంలో దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత నిర్ణీత సమయంలో నాలుగు వేల అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. కడప జిల్లా అయోధ్య నగర్‌కు చెందిన వెంకట సాయి భరత్‌రెడ్డి ఎడ్ల జత రెండవ స్థానంలోను, కృష్ణా జిల్లా యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీ మధుకు చెందిన ఎడ్ల జతలు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామ కోటయ్య, కొల్లిపరకు చెందిన గుదిబండ శ్రీనివాసరెడ్డి, కృష్ణా జిల్లా మల్లవల్లికి చెందిన అక్కినేని సాన్వి చౌదరి, నంద్యాల జిల్లా గిడిగి రేవులకు చెందిన పెరుమాళ్ళ అంజయ్ కుమార్, గుంటూరు జిల్లా నవలూరుకు చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జతలు తరువాత స్థానాల్లో నిలిచాయి. పోటీలను సమర్థంగా నిర్వహిస్తున్న బయ్యవరం పోలేరమ్మ తల్లి, లక్ష్మీ తిరుపతమ్మ కమిటీ వారిని పలువురు అభినందించారు. పోటీలు సోమవారం కూడా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అమ్మ చెరవాణి బంధం.. విలపిస్తున్న పేగుబంధం!

- విజయనగరం వివాహితకు భర్తతో విభేదాలు..
- ఇద్దరు పిల్లలను వదిలేసి.. ప్రియుడికోసం పిడుగురాళ్లకు..
- అమ్మ ఎక్కడంటూ పోలీస్‌స్టేషన్‌లో చిన్నారులు


పోలీస్‌స్టేషన్‌లో చిన్నారులు

పిడుగురాళ్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో చోటు చేసుకున్న ఓ హృదయ విదారకమైన ఘటన స్థానికులను కలచివేస్తోం ది. భర్తతో విభేదాల కారణంగా.. చరవాణిలో పరిచయమైన వ్యక్తి కోసం.. ముక్కుపచ్చలారని ఇద్దరు పిల్లను వదిలేసి ఓ తల్లి విజయనగరం నుంచి పిడుగురాళ్ల మండలంలోని తుమ్మల చెరువుకు చేరుకుంది. పిల్లల కోసమైనా.. తిరిగి వెళ్లాలని పెద్దలు, పోలీసులు నచ్చజెప్పినా ససేమిర అంటోంది. వివరాల్లోకి వెళ్తే విజయనగరం జిల్లాకు చెందిన ఓ మహిళ భర్తతో తరుచూ గొడవ పడుతూ ఉండేది. ఇదే సమయంలో తుమ్మలచెరువు గ్రామానికి చెందిన రాజేష్‌తో ఆమెకు ఫోన్‌లో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ఇద్దరి మధ్య వివాహేతర బంధానికి దారితీయడంతో.. ఆ మహిళ భర్తను వదిలి ఐదు నెలల క్రితం తుమ్మలచెరువులోని రాజేష్ వద్దకు చేరుకుంది. ఆ మహిళ కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులు, గ్రామపెద్దల ద్వారా నచ్చజెప్పి పిల్లలతో కలిసి ఉండేలా విజయనగరం పంపించారు. వారం క్రితం సదరు మహిళ మళ్లీ రాజేష్ వద్దకు చేరుకుంది. తల్లికోసం ముక్కు పచ్చలారని చిన్నారులు అమ్మా.. ఎక్కడున్నావని వెతుక్కుంటూ కుటుంబ సభ్యులతో కలిసి పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో చిన్నారుల తల్లిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఇద్దరు పిల్లలను వదిలి ఇక్కడికి వచ్చి ఉండడం సరైన పద్ధతి కాదని, పిల్లల జీవితాలు పాడైపోతాయని పెద్దలు, పోలీసులు నచ్చజెప్పారు. అయినా ఆ మహిళ భర్త దగ్గరకు వెళ్లేందుకు ససేమిర అనడంతో.. పోలీసులకు, గ్రామ పెద్దలకు ఏమి చేయాలో పాలుపోలేదు. పిల్లలతో కలిసి ఉండేలా బలవంతం చేస్తే ఏదైనా చేసుకుంటుందేమోననే సంశయంతో ఆ మహిళకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో చిన్నారులకు పిడుగురాళ్ల పోలీసులే ఆహారం, మంచినీరు అందిస్తున్నారు. పలు పనుల మీద పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారు విషయం తెలుసుకొని ఇదేమి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

సమష్టి కృషితోనే గురుకుల విద్యాసంస్థల అభివృద్ధి

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు


సత్కారం పొందిన గురుకుల ఉపాధ్యాయులతో జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు (విద్య) అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాల్లో విద్యనభ్యసించిన ఎందరో.. రాష్ట్ర ఉన్నతాధికా రులుగా ఎదిగారని ఆయా గురు కుల పాఠశాలల, జూనియర్ కళాశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సమాజ ంలోని ప్రతి ఒక్కరూ సహకరిం చాలని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పేర్కొన్నా రు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏ దేశ అభివృద్ధిలోనైనా పాఠశాల విద్య ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సమాజంలోని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు గురుకులాలు ఒక వరమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకులాలు అత్యున్నత విద్యా ఫలితాలు అందిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ కనపరుస్తుండటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య వి.రాజు, రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, తాడికొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.మధుసూదనరావు, ఫౌండేషన్ ఆహ్వాన కమిటీ కన్వీనర్ డాక్టర్ పీవీ మల్లేశ్వర్, రాపోలు జగన్, డి.గోవిందరెడ్డి, ఎ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గురుకుల ఉపాధ్యాయులను సందర్భంగా సత్కరించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

- సినీ నటి హెబ్బా పటేల్



సభలో పాల్గొన్న సినీ నటి హెబ్బాపటేల్, సజీల, శిరీష

గుంటూరు మెడికల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని ప్రముఖ సినీ నటీ హెబ్బా పటేల్ సూచించారు. తక్కెళ్లపాడుకు చెందిన కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో రొమ్ము కేన్సర్‌పై అవగాహన కోసం ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన హెబ్బా పటేల్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, సిమ్స్ విద్యా సంస్థల అధినేత బి.శివశిరీష వాకథాన్‌ను ప్రారంభించారు. వాకథాన్‌లో సిమ్స్ నర్సింగ్ కళాశాల, సిబార్ డెంటల్ కాలేజీ విద్యార్థులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేడియంలో జరిగిన బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన సభలో హెబ్బా పటేల్ మాట్లాడుతూ నలభై ఏళ్లు దాటిన ప్రతి మహిళ తప్పనిసరిగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ చక్ర హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణుల బృందం రాము, మహతి, శ్రీఫణి, సుమన్, చంద్రశేఖర్, యశ్వంత్, ప్రియదర్శిని, హరీష్, రాకేష్ తదితరులు రొమ్ము కేన్సర్‌కు దారి తీసే కారణాలు, వ్యాధిని తొలి దశలో గుర్తించే పరీక్షలు, సూది పరీక్ష, వైద్య చికిత్సలు వంటి పలు అంశాలను వివరించారు.

తాడువాయి బంగారు తండాలో చోరీ

రూ.2 లక్షల నగదు, 50 గ్రాముల బంగారం అపహరణ

అచ్చంపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయి గ్రామ పంచాయతీలోని బంగారు తండాలో బాణావత్ సైదా నాయక్ ఇంటిలో ఆదివారం చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉదయం 11 గంటలకు రూ.2 లక్షల నగదు, 50 గ్రాముల బంగారం చోరీకి గురైంది. ఈ మేరకు బాధితులు సైదా నాయక్ అచ్చంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎంత వరదొచ్చినా.. ఇక అమరావతి సేఫ్

(5వ పేజీ తరువాయి)

శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరిస్తే రాజధాని అమరావతి భద్రంగా ఉంటుంది.

కమాండ్ కంట్రోల్‌తో అంతా సవ్యంగా...

ఈ మొత్తం వ్యవస్థను అన్నీ వేళల్లో నిర్వహించేందుకుగాను ఏపీసీఆర్‌డీఏ నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న అత్యాధునికమైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉపయోగపడనుంది. దీని ద్వారా రాజధాని ప్రాంతంలోని వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ఏ సమయంలో ఎంత వర్షం కురుస్తుంది... ఏ రిజర్వాయర్‌లో నీరెంతుంది... కాలువల్లో నీరు ఏ పరిణామంలో ఎంత వేగంతో ప్రయాణిస్తుందనే అంశాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని సాంకేతికంగా తెలుసుకుంటూ తదనుగుణంగా రిజర్వాయర్‌లను బ్యాలెన్స్ చేస్తూ ఎత్తిపోతల పథకాలను నిర్వహిస్తారు. దరిమిలా అమరావతి నగర వీధుల్లో చుక్కనీరు కూడ నిలిచే పరిస్థితి ఉండదు. పైగా అమరావతిలో ప్రజల నీటి అవసరాలను తీర్చడంలో ఈ రెండు రకాల ప్రణాళికలు ఎంతో అద్భుతంగా ఉపకరిస్తాయి.

దిగువ పరీవాహక ప్రాంతంలో తొలిదశ పనులు

రాజధాని అమరావతిని వరదల కోణంలో... కొండవీటివాగు పరీవాహక ప్రాంతాన్ని ఎగువ పరీవాహక, దిగువ పరీవాహక ప్రాంతమనే రెండు భాగాలుగా వర్గీకరించారు. రాజధానికి అత్యవసరంగా ముందు దిగువ పరీవాహక ప్రాంతంలో వరద జలాలను క్రమబద్ధీకరించే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ మొదటి దశ ప్రణాళికను అమలుకు రూ. 1,236.74 కోట్లను ఖర్చు చేస్తున్నారు. ఈ మేరకు సదరు పనులన్నింటిని ఎంవీఆర్ ఇన్‌ఫ్రా సంస్థ చేజిక్కించుకుని క్షేత్రస్థాయిలో పనులను ముమ్మరంగా నిర్వహిస్తుంది. వచ్చే ఏడాది చివరి నాటికి పనులన్నింటిని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

7న విజయవాడలో ధర్నాను జయప్రదం చేయాలి

రెంటచింతల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇవ్వాలని, టీచర్లకు బోధనేతర పనులు అప్పచెప్పవద్దని ఈ నెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ మండల అధ్యక్షురాలు బేబీ రాణి కోరారు. ఆదివారం సమావేశమైన ఎస్టీయూ సంఘ టీచర్లు మాట్లాడుతూ పీఆర్సీ ఇస్తామని ఎన్నికల ముందు హామీనిచ్చారని అధికారంలోకి వచ్చాక చేసిన వాగ్దానాలను విస్మరించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, లేళ్ల శ్రీనివాసరావు, ఖుద్దూస్, వెంకటేష్, భీముడు నాయక్, సిలార్ అహ్మద్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రెంటచింతల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల 11కేవీ సబ్‌స్టేషన్లోని రెంటాల గ్రామ ఫీడర్ మరమ్మతులు దృష్ట్యా నేడు ఆ గ్రామానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మస్తాన్ వలి చెప్పారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

● గురజాల : మండలంలోని చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాలకు సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు.

● నకరికల్లు : అత్యవసర మరమ్మతులు చేయాల్సి ఉన్నందున దేచవరం, రూపెనగుంట్ల, శాంతినగర్ గ్రామాల్లో సోమ వారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఏఈఈ జీ సుచరిత ఆదివారం తెలిపారు.

కుక్కమూడి ప్రసాద్‌కు డాక్టరేట్

దుర్గి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రసాద్‌ను అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, గుంటూరు ద్వారా గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మినీహాల్‌లో ప్రసాద్ అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పెద్దటి యోహాన్ చేతుల మీదుగా డాక్టరేట్, సర్టిఫికెట్ అందుకున్నారు.

ఆటో డ్రైవర్ల సేవలో ప్రభుత్వం

రెంటచింతల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని అమలు చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి అన్నారు. ఆదివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ఎన్నికల హామీల్లో లేనప్పటికి ఆటో డ్రైవర్ల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వ్యవహరించిందన్నారు. వైసీపీ హయాంలో ఈ పథకం కొంతమంది డ్రైవర్లకే అమలు చేశారని ఈ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు, సుమంత్‌రెడ్డి, డీసీ చైర్మన్ పోట్ల నరసింహారావు, బి.రామకృష్ణ, శౌర్రెడ్డి, రాయపరెడ్డి, మందలపు హనిమిరెడ్డి, ప్రభురాజు యాదవ్, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

అన్నదానం

పిడుగురాళ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కుసుమ హరినాదబాబా దేవాలయం వద్ద ఆదివారం మహా అన్నదానం జరిగింది. మాదల కోటేశ్వరి జ్ఞాపకార్థం మా దల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సుమారు 500మందికి పైగా అన్నదానం నిర్వహించారు. దేవాలయం వద్ద ప్రతి ఆదివారం అన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో చేపడుతున్నట్లు వల్లంబొట్ల వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికి 214 ఆదివారాలు అన్నదానం చేసినట్లు నాగేశ్వరరావు తెలిపారు.

వాల్మీకి జయంతి ఘనంగా జరుపు కోవాలి

మాచవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈనెల 7వ తేదీన వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా కర్నూలులో నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన కూటమికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 7వ తేదీ 10 గంటలకు వాల్మీకి జయంతి జరుగుతుందని, వాల్మీకి బోయలందరూ హాజరుకావాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపిక

నకరికల్లు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నరసింగపాడు పంచాయతీ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు స్వచ్ఛాంధ్ర అవార్డుకు ఎంపికైనట్టు డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు తెలిపారు. సోమవారం నరసరావుపేటలో ఈ అవార్డును అప్పారావుకు బహూకరిస్తారని ప్రసాదు వివరించారు.

కూటమి సారథ్యంలో సంక్షేమం పరుగులు

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మండాదిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మినీ గోకులం షెడ్‌కు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ ప్రసాద్, ఏపీవో సురేఖ, తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు గుజ్జుల పాపిరెడ్డి, చిన్నపురెడ్డి అంకిరెడ్డి, అన్నపురెడ్డి రామలింగారెడ్డి, మూల వెంకటచెన్నారెడ్డి, సుంకర కొండా, మూలంరెడ్డి రోశిరెడ్డి, గన్నవరపు గాలయ్య, దేశం లక్ష్మారెడ్డి, గన్నవరపు కేశవ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల షెడ్లకు భూమిపూజ

కారంపూడి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని వినుకొండ రోడ్డులో గల యానాది కాలనీలో రెండు మినీ గోకులాల షెడ్లకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ఏపీవో నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్‌యాదవ్, పంగులూరి పుల్లయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఓబులేశునిపల్లెలో...

దుర్గి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లెలో మినీ గోకులం నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భూమిపూజ నిర్వహించారు. దీనికి సంబంధించిన రూ.2 లక్షల ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం ప్రతిపాదనలు కరెక్ట్‌గా ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పెద్దలు గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మాణం, గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామస్థులకు హామీనిచ్చారు.

టీడీపీలో చేరిక..

నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తుండడంతో ఓబులేశునిపల్లె గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ వర్గాల 50 కుటుంబాలు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ సత్యనారాయణ, ఏపీవో మల్లికార్జునరావు, ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్, ఏవో శివప్రసాద్, ఎఫ్ఏ కొమ్ము ఆంధ్రయ్య, టీఏలు గోవింద్‌నాయక్, గోవిందు, జేఈ శ్రీనివాసరావు, మేకల శిరీషా, కూటమి నేతలు పంగులూరి పుల్లయ్య, లింగా రమేష్, దుగ్గెంపూడి జానకి రామయ్య, గర్నె రమేష్, మాగులూరి శ్రీను పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన ఎస్సీ, బీసీ వర్గీయులతో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

నాగార్జున కొండపై పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ.1,58,550


లాంచీలో నాగార్జున కొండకు వెళ్తున్న సీఐఎస్ఎఫ్ డీజీ ప్రణీత్‌చంద్ర

విజయపురిసౌత్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. సీఐఎస్ఎఫ్ డీజీ ప్రణీత్ చంద్ర సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు శాంతిసిరి, నాగసిరి, అగస్త్యా లాంచీలలో చేరుకున్నారు. కొండపై గల మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం సందర్శించారు. ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా రూ.1,58,550 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. సాగర్ నూతన వంతెన, పాత వంతెన, లాంచీ స్టేషన్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. పర్యాటకులు భారీగా తరలిరావడంతో ఎత్తిపోతల నుంచి సాగర్ ప్రాజెక్ట్ రహదారి వాహనాలతో రద్దీగా మారింది.

ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

● రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షరీఫ్

బెల్లంకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు అక్కల వెంకట రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భం గా మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్రైవర్ల జీవితాల్లో వెలుగు నింపాలని, ప్రతి ఒక్కరికి రూ.15వేలు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు లక్ష్మీనారాయణ, గుడిసె కొండయ్య, ఓర్సు ఆనంద్, వెన్నా సీతారామిరెడ్డి, ఆసుల జగన్, సర్పంచ్ జ్యోతి సముద్రం, పీఎస్‌కే రసూల్, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, వైస్ సర్పంచ్ రజాక్, డీలర్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అమరావతి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్లో 1985-86లో పదో తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం హైస్కూల్ ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 40 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యను అందించిన విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1985-86 టెన్త్ విద్యార్థులు

ఛత్రపతి శివాజీ మహరాజ్ దక్షిణ యాత్ర

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ తెలుగు నేలలో అడుగుపెట్టి 348 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొనసాగుతున్న దక్షిణ యాత్ర ఆదివారం సత్తెనపల్లికి చేరుకుంది. సత్తెనపల్లి ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు యాత్ర బృందానికి స్వాగతం పలికారు. శివాజీ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో పులహరి భానోజీ, ఫిరోజీ, వెంకోజీ, శివాజీ, గోవిందరావు, బద్రి నారాయణ, రఘు, నరసింహాచార్యులు, కళ్యాణ్ ప్రసాదు, పవన్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోరుబాట

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు ఈనెల 7న ఉపాధ్యాయుల పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘ నేతలు ఆదివారం కోరారు. పోరుబాట కరపత్రా లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుభానీ, మక్కెన శ్రీనివాసరావు, చిన్నం శ్రీనివాసరావు, అగస్టస్‌బాబు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉన్న వర్షపు నీటిని బయటకు పంపాలి

బెల్లంకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జీ.రవిబాబు తెలిపారు. ఆదివారం బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వందల మంది విద్యార్థులు చదువుకుంటున్న బెల్లంకొండ హైస్కూల్ ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉన్నా కూడా పట్టించుకోకపోవటం అన్యాయమని అన్నారు. ప్లే గ్రౌండ్‌లో నీరు నిల్వ ఉండటం వల్ల మురుగు వాసన వస్తుందని, దోమలు వ్యాప్తి చెందుతాయని, తద్వారా విద్యార్థులకు రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, వెంటనే మురుగు నీటిని బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, బీ నరసింహారెడ్డి, దుగ్గి కోటేశ్వరరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేంద్ర బృందాల తనిఖీ

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బాలింతలు, గర్భిణులతో పాటు ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల సమగ్ర పోషణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర మహిళా అభివృ ద్ధి శిశు సంక్షేమ శాఖ పలు పథకాలు అమలు చేస్తుంది. ఆ క్రమంలో సక్షం అమల్లో భాగంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పన కు చర్యలు చేపట్టారు. వాటి పరిశీలనకు ఈనెల 6వ తేదీన పల్నాడు జిల్లాలో కేంద్ర బృందాలు పర్యటించనున్నాయి. పల్నాడు జిల్లాలోని తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 20 కేంద్రాల్లో వసతుల కల్పన, న్యూట్రీ గార్డెన్‌తో పాటు పలు అంశాలను కేంద్ర బృందాలు క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నాయి. ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర బృందాలు సక్షం పథకం అమలు తీరును పరిశీలిం చనున్న ట్టు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

స్వచ్ఛ అవార్డులకు అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రా లుగా పల్నాడు జిల్లాలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపికయ్యా యని పల్నాడు జిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి తెలిపారు. అమరావతి మండలం లింగాపురం, పెదకూరపాడు మండలం జలాల్‌పురం, దాచే పల్లి మండలం గామాలపాడు, నూజెండ్ల మండలం మృత్యుంజాపురం, యడ్లపాడు మండలం వంకాయలపాడులలో అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలుగా ఎంపికయ్యాయని, ఈనెల 6వ తేదీ సోమవారం నరసరావుపేటలోని భువనచంద్రటౌన్ హాల్లో జరగనున్న కార్యక్రమంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు అవార్డులు అందుకోనున్నా యని ఆమె తెలిపారు.

ప్లాస్టిక్ వద్దు.. జ్యూట్ సంచులే ముద్దు


ప్రజలకు జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న అమ రావతి సేవాసమితి సభ్యులు

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ సంచులు వాడ వద్దని వాటి వల్ల కలిగే అనర్థాలను అమరావతి సేవాసమితి సభ్యులు ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు గుళ్ళపల్లి కృష్ణ ఆర్థిక సాయంతో పలువురికి జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి వీరాంజనేయులు, పాటిబండ్ల రవిరాజ, షారోన్ కుమార్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు మోడల్ స్కూల్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు

క్రోసూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు స్వచ్ఛ ఆంధ్రా అవార్డు లభించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ సూజన్ తెలిపారు. జిల్లా తరఫున ఎంపికైన ఐదు పాఠశాలల్లో తమ పాఠశాల కూడా ఉన్నట్టు ఆమె చెప్పారు. 6న మధ్యాహ్నం 3గంటలకు నరసరావుపేట టౌన్ హాల్లో జరిగే కార్యక్రమంలో కలెక్టర్, డీఈవో చేతుల మీదుగా అవార్డును స్వీకరించనున్నట్టు తెలిపారు. స్వచ్ఛాంధ్ర అవార్డుకు తమ పాఠశాల ఎంపిక కావటానికి కృషి చేసిన సహచర అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ వారికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

రహదారి పనులు ప్రారంభం

గురజాలటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగుడిపాడు నుంచి జనార్ధనపురం గ్రామానికి వెళ్లే తారు రోడ్డు పనులను ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. రహదారి సమస్యను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి కూటమి నేతలు తీసుకెళ్లారు. స్పందించిన యరపతినేని 1.3 కి.మీ.ల రహదారికి రూ.72 లక్షలు మంజూరు చేయించి పనులను వెంటనే మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో రోడ్డు పనులను అధికారులు మొదలుపెట్టారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలుచూరి నాగేశ్వరరావు, వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా బస్తాల పంపిణీ

గురజాలటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెగుంతలో ఆదివారం కూటమి నేతలు, వ్యవసాయ శాఖాధికారులు రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. కూటమి నేతలు జాస్తి ప్రకాష్, వీరనారాయణ, వెంకటరామయ్య, సాయి, సత్యం, పున్నయ్య మణికంఠ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై గ్రామసభలు

అచ్చంపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం, వేల్పూరు, గ్రంథసిరి, కోనూరు, కొండూరు, అంబడిపూడి, తాళ్లచెరువు గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల్లో చేపట్టబోయే 79 రకాల ఉపాధి హామీ పనుల గురించి వివరించారు. 18 రకాల పండ్ల తోటల పెంపకం పనులు, పశువుల షెడ్ల నిర్మాణాలు, గడ్డి పెంపకం, పంట కాలువల్లో, చెరువుల, కుంటల్లో పూడిక తీత పనులు, కంపోస్టు, ఫారం పాండ్లు మొదలైన పనుల గురించి అవగాహన కల్పించారు. వీటితో పాటు సూపర్ ఈజీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు ఏపీవో తెలిపారు. ఈ గ్రామ సభలకు అన్ని గ్రామ పంచాయతీల గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నట్టు ఏపీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏఆర్ సేవాసదన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏఆర్ సేవా సదన్ ఆధ్వ ర్యంలో ఆదివారం విజయవాడ హెల్ప్ హాస్పిటల్ సహకారంతో ఎస్‌వీ ఆర్ డిగ్రీ కళాశాలలో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, సలహాలు, సూచ నలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు కార్తీక్‌నాయుడు, నాగకిరణ్, సేవాసదన్ సభ్యులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారిని నిర్మించుకున్న స్థానికులు

దాచేపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని 15వ వార్డులో రహదారి రాళ్ళు రప్పలతో ఉండటంతో స్థానిక కుటుంబాల వారు సొంతంగా చందాలు వేసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఏళ్ళ తరబడి ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూసినా ఎటువంటి ఆశాభావ పరిస్థితి లేకపోవటంతో స్థానికులంతా సొంతంగా చందాలు వేసుకొని రోడ్డు నిర్మించటంతో పలువురు అభినందించారు.


గుడిపాడు గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

కూటమి పాలనలోనే గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాతనే గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆదివారం మండలంలోని గుడిపాడులో ఆయన పర్యటించారు. నియోజకవర్గంలో అంతర్గత రహదా రుల నిర్మాణానికి సుమారు రూ.40కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. సంవత్సరంన్నర కాలంలో నియోజక వర్గ అభివృద్ధికి వంద కోట్లకు పైగా నిధులు వెచ్చించినట్టు తెలిపారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో గ్రామాల్లో పూర్తిగా అభివృద్ధి కుంటుపడిపోయిందని, తాము అధికారంలోకి రాగానే అంతర్గత రహదారులన్నింటినీ సిమెంట్ రోడ్లుగా నిర్మిస్తున్నామని తెలిపారు. గుడిపాడు గ్రామంలో గణనీయమైన అభివృద్ధి సాధించినట్టు తెలియ జేశారు. రానున్న కాలంలో నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు తెలిపారు. గుడిపాడులో జరిగిన వివిధ ప్రైవేట్ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు మొగల్ జాన్, మాజీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఏహూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయ కులు దుద్దుల యోహాన్, నలజాల సదాశివరావు, తోక వెంకటరావు, అచ్చంపేట టీడీపీ నాయకులు నల్లమేకల వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు ఉన్నారు.

పిరమిడ్ ధ్యాన మందిరం శాకాహార ర్యాలీ

విజయపురిసౌత్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మర్షి పితామహపత్రీజి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యాన అహింసా శాకాహార ర్యాలీని ఆదివారం నిర్వహించారు. సభ్యులు ప్లకార్డులు చేతబూని జీవహింస చేయరాదంటూ నినాదాలు చేస్తూ నాగార్జున సాగర్ నూతన వంతెన వద్ద నుంచి విజయపురి సౌత్‌లోని డౌన్ మార్కెట్, లాంచీ స్టేషన్ వరకు ర్యాలీ జరిపారు. పిరమిడ్ మాస్టర్ జె.సతీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో జె.శ్రీను, రంగనాయకులు, భూపతిరాజు పాల్గొన్నారు.

హిందూత్వాన్ని బలోపేతం చేయాలి

● ఏపీ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్‌జీ


మాట్లాడుతున్న జనార్ధన్‌జీ, పక్కన మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు తదితరులు

పిడుగురాళ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కులాలు వేరైనా.. ప్రాంతాలు వేరైనా.. మతాలు వేరైనా... అందరూ హిందూత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఏపీ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్‌జీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక సత్యసాయి కల్యాణ మండప ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. హిందూ ధర్మం కోసం, దేశం కోసం పని చేసే హిందువులను కలుపుకోవడం కోసం ప్రతి గ్రామం.. ప్రతి బస్తీలో ఉన్న ఇంటింటికి ఆర్‌ఎస్‌ఎస్‌ను పరిచయం చేయాలనే ఉద్దేశంతో శతాబ్ది కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేవీ సుబ్బారావు, యేలూరి శశి కుమార్, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, వెంకయ్య, ఆత్మకూరి రాంబాబు, బోడిగం రామారావు, చుండూరు శ్రీనివాసరావు, కాకుమాను జగన్ పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన అనేక మంది పాల్గొన్నారు.

సమాజ సేవలో ఆర్‌ఎస్‌ఎస్ కృషి ప్రధానం


సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్ నాయుడు

అమరావతి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశ సేవలో సమాజ సేవలో ఆర్ఎస్ ఎస్ స్వార్థం లేని సేవను అందిస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యవాహ వేణుగోపాల్ నాయుడు అన్నారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో వేణుగోపా ల్ నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఖండ కార్యవాహ జి. నరేంద్ర అధ్యక్షత వహించారు. ముందుగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రధాన వీధిలో కవాతు నిర్వహించారు. కవాతులో తాళ్లాయపాలెం శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి పాల్గొన్నారు. సమావేశంలో శివస్వామి మాట్లాడుతూ సనాతన ధర్మా న్ని పరిరక్షిస్తూ దేశ సేవలు ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

● దాచేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీలోని రంగనాయక స్వామి దేవాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. వంద మందికి పైగా స్వయం సేవక్‌లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట జిల్లా సామాజిక సమరసత సంయోజక్ కొత్త పెద రాము, కండ్ కార్యవహ్ అనంత నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బోస్టన్ నగరంలో డాక్టర్ కోడెల శివరామ్ పర్యటన

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని బోస్టన్ నగరంలో శనివారం మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సభ్యులు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ పాల్గొని ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సభ్యులు, బోస్టన్ తెలుగు అసోసియేషన్ సభ్యులతో కలసి ఎన్‌టీఆర్, డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిర పడిన ప్రతి ఒక్కరు పీ-4 కార్యక్రమంలో భాగస్వాములై ప్రతి కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకొని వెళ్లాలన్న చంద్రబాబు నాయుడు కల సాకారమయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గొంది శ్రీనివాస్, పొట్లూరి అనీల్, కృష్ణ ప్రసాదు, సూర్య, రాఘవ, సురేష్, గోపీ, చంద్ర, సతీష్, చుండ్రు గౌతమ్, సునీల్, తారక్, వెంకట్, గోషేష్, ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సభ్యులు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టర్ సభ్యులు పాల్గొన్నారు.


అమెరికాలోని బోస్టన్ నగరంలో టీడీపీ ఎన్‌ఆర్‌ఐలతో డాక్టర్ కోడెల శివరామ్

కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేయాలి

బెల్లంకొండ, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ వ్యవస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ సంస్థలో విలీనం చేయాలని పల్నాడు జిల్లా కాంట్రాక్టు నాయకుడు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం బెల్లంకొండ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు ఉద్యో గులతో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలపై మేనేజ్‌మెంట్‌కు పలు దఫాలుగా వినతిపత్రాలు ఇచ్చామని, అవి నేటికి పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళ్త న్నామని, ఆరో తేదీన విశాఖపట్నంలో సీఎండీ కార్యాలయం వద్ద, 8వ తేదీన తిరుపతి సీఎండీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. 13న చలో విజయవాడ, అప్పటికీ సమస్య పరిష్కరించకపోతే 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయాలని పిలుపునిచ్చామని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు జిలానీ, సుభానీ, వెంకటరావు, ఏడుకొండలు, యలమంద తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

స్వచ్ఛ అవార్డులకు అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక

సత్తెనపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలుగా పల్నాడు జిల్లాలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపికయ్యాయని పల్నాడు జిల్లా ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి తెలిపారు. అమరావతి మండలం లింగాపురం, పెదకూరపాడు మండలం జలాల్‌పురం, దాచేపల్లి మండలం గామాలపాడు నూజెండ్ల మండలం మృత్యుంజయపురం, యడ్లపాడు మండలం వంకాయలపాడులలో అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలుగా ఎంపికయ్యాయన్నారు. ఈ నెల 6వ తేదీ సోమవారం నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో జరగనున్న కార్యక్రమంలో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు అవార్డులు అందుకోనున్నాయని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని చవిటిపాలెం, రాజీవ్ గాంధీ కాలనీ, తిమ్మాపురం డొంక ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

● యడ్లపాడు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని యడ్లపాడు, కొండవీడు సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులలో భాగంగా పలు గ్రామాలలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ మరమ్మతులలో భాగంగా విద్యుత్ లైన్లు మరమ్మతులు చేయాల్సి ఉన్నందున కొత్తపాలెం, జగ్గాపురం, జాలాది, గుత్తావారిపాలెం గ్రామాల పరిధిలోని గృహ, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని డీఈఈ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

నూజెండ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రపునాయుడుపాలెం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్రపునాయుడుపాలెంకు చెందిన మేదరమెట్ల హేమంత్ చౌదరి, మేదరమెట్ల దీపక్ సాయిలు గుర్రపునాయుడుపాలెం నుంచి కళాశాలకు, స్కూల్‌కు, ఉప్పలపాడు గ్రామానికి చెందిన వినుకొండ గోవిందు గుర్రపునాయుడుపాలెం నుంచి వేర్వేరు మోటారు సైకిల్స్‌పై వినుకొండ వైపు వెళ్తుండగా లక్ష్మీపురంనకు చెందిన ఆటో వినుకొండ నుంచి వస్తూ ఢీకొట్టడంతో మోటారు సైకిళ్ళపై వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వినుకొండకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

విద్యాభివృద్ధికి కార్డ్స్ కృషి అభినందనీయం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): బడుగువర్గాల విద్యాభివృద్ధికి కార్డ్స్ కృషి అభినందనీయమని బాలబాట పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారావు ఆదివారం అన్నారు. పట్టణంలోని సంజీవరావు కాలనీలో ఏర్పాటుచేసిన బాలబాట అభివృద్ధి కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవర్గాల అభ్యున్నతికి చదివే ముఖ్యమన్నారు. కార్డ్స్ అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల బాలబాట అభివృద్ధి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలబాట అభివృద్ధి కార్యకర్తలకు నెలవారీ సరుకులను అందజేశారు.

వీరాంజనేయస్వామి ఆలయానికి రూ.50వేల విరాళం

వినుకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాడు గ్రామంలోని శ్రీమదమంచిపాటి వీరాంజనేయ స్వామివారి దేవస్థానానికి జూనియర్ అసిస్టెంట్ దద్దాల కోటేశ్వరావు రూ.50,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ వారు దాత దద్దాల కోటేశ్వరరావును అభినందించారు.

ఈదురు గాలులతో వర్షం

● కూలిన చెట్లు.. విద్యుత్‌కు అంతరాయం


బోయపాలెం సంగంగోపాలపురం మార్గంలో కూలిన భారీ వృక్షం

యడ్లపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయత్రం ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీనితో మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతోపాటు రహదారులకు అడ్డంగా భారీ వృక్షాలు కూలడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బోయపాలెం-సంగంగోపాలపురం మార్గంలో ఈదురుగాలుల ధాటికి భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో చెంఘీజ్‌ఖాన్‌పేట, కొండవీడు, కోట, ఫిరంగిపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో కొండవీడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి సుమారు గంటపాటు భారీవర్షం కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పెను గాలులకు ప్రధాన కూడళ్లలో నెలకొల్పిన ఫ్లెక్సీలు చిరిగిపోయి, గాల్లోకి లేచి ఎగిరిపడ్డాయి.

నూతన ఉపాధ్యాయుల కోసం ఎదురు చూపులు

● వినుకొండ నియోజక వర్గంలో అధికంగా ఉన్న ఖాళీలు
● కొన్ని అయినా భర్తీ అవుతాయని ఆశలు



బొల్లాపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు త్వరలో విధుల్లో చేరనున్నారు. వారిలో కొందరైనా మా ఊ గ్రామాలకు సారు వస్తారో... రారో... అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న వినుకొండ నియోజక వర్గంలోని బొల్లాపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా ఖాళీలు ఉండటంతో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. నియోజకవర్గంలో మొత్తం మీద 250 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. బొల్లాపల్లి మండలంలో 150 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో జరిగిన బదిలీల కారణంగా ఖాళీల సంఖ్య పెరిగిపోయింది. మండలంలో 35 పాఠశాలల్లో అసలు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేక మూతవేయాల్సిన పరిస్థితి నెలకొం ది. కాని వాటిని డెప్యుటేషన్ పద్ధతిలోను, బదిలీపై వెళ్ళి నవారిలో కొందరిని వెనక్కి రప్పించి అవి మూతపడకుండా సాగిస్తున్నారు. తాజా డీఎస్సీ ద్వారా జిల్లాలో 1159మంది ఉపాధ్యాయులు నియామకమయ్యారు. వీరికి ఈ నెల 3వ తేదీ నుంచి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం 10వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా పాఠశాలలకు పంపనున్నారు. సమస్య అంతా కౌన్సెలింగ్ సమయంలోనే జరుగుతుంది. పాఠశాలలను ఎంపిక చేసుకొనే ఉపాధ్యాయులు కౌన్సెలింగ్ సమయంలో ఎక్కువగా పట్టణ ప్రాంతాలు, రవాణా సౌకర్యాలు ఉన్న మండలాలు, ఇత ర వసతులు ఉన్న ప్రాంతాలను కోరుకుంటారు. దీనివల్ల ప్రతిసారీ మారుమూల మండలంలో ముఖ్యంగా జిల్లాలో వెనుకబడిన బొల్లాపల్లి మండలంలోని పాఠశాలలకు ఉపాధ్యాయులు వచ్చేందుకు మక్కువ చూప టం లేదు. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిపడినంత లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉ పాధ్యాయులుగా ఎంపికైన వారిలో స్కూల్ అసిస్టెంట్‌లు ఎక్కువమంది ఉండటంతో వారు బొల్లాపల్లి మం డలానికి కేటాయిస్తారని విద్యార్థుల తల్లిదండ్రుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మిగిలిన ప్రాంతా ల్లో ఈ ఖాళీలు తక్కువగా ఉన్న కారణంగా ఇక్కడకు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయవర్గాలు చెపుతున్నాయి. కనీసం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు వచ్చినా ఉన్న ఖాళీల్లో 85శాతం భర్తీ అవకాశం ఉంది. కౌన్సెలింగ్ సమయంలో బొల్లాపల్లి మండలంలో వందశాతం పూర్తయ్యే విధంగా సంబంధిత విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

● ఫ్యాప్టో పల్నాడు జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ మోహనరావు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు ఎం మోహనరావు తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో పోరుబాటలో భాగంగా అక్టోబరు 7న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో పల్నాడు జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.మోహనరావు అన్నారు. ఆదివారం నరసరావుపేటలో పల్నాడు జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో చలో విజయవాడ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.మోహనరావు మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలలో ఉన్న అసంబద్ధతను తొలగించాలని, 72, 73, 74 జీవోలను అమలు చేయాలన్నారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు. సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలన్నారు. అసెస్మెంట్ పుస్తకాలను పునఃసమీక్షించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ తరపున బిక్కి ప్రజామూర్తి, యూటీఎఫ్ టీ వెంకటేశ్వర్లు, దేవబత్తుల కోటేశ్వరరావు, డీఎన్ఎస్ మూర్తి, కే రవి, సీహెచ్ నాగేశ్వరరావు, ఎం.రామాంజనేయులు, టీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబరు 7న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఫ్యాప్టో రాష్ట్ర బాధ్యుడు కే కోటేశ్వరరావు, జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి బి.సంపత్‌బాబు ఆదివారం కోరారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత 26నెలలుగా పెండింగ్‌లో ఉన్న 12వ పీఆర్సీ కమిషన్ చెర్మన్ నియామకం చేయాలని, ఈలోగా మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని, రూ.20వేల కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. మొత్తం 20 డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఫ్యాప్టో నాయకులు.కే తిరుపతిస్వామి, వి అక్కయ్య, పోటు శ్రీనివాసరావు, కే జె ప్రకాష్, యాసిన్, జె.పార్థసారథి, బిట్రా నాగేశ్వరరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లన జయప్రకాష్, షేక్ మస్తాన్ వలి, బొంత రవి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

తెలుగుజాతి ఉనికిని చాటిన నేత చంద్రబాబు

● అమెరికా పర్యటనలో డాక్టర్ కోడెల శివరామకృష్ణ


బోస్టన్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులతో డాక్టర్ కోడెల శివరామకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు వల్లభుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి మనందరికి ఒక గుర్తింపు తీసుకువస్తే, మన ఉనికిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ అన్నారు. అమెరికాలోని బోస్టన్ నగరంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్ర మం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు, గ్రేటర్ బోస్టన్ తెలుగు అసోసియేషన్ సభ్యులతో కలిసి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ తెలుగువారిలో ఉన్న కష్టపడే తత్వానికి, క్రమశిక్షణకు ప్రపంచ స్థాయిలో గుర్తింపును తీసుకొని వచ్చి, మనవాళ్ళు ఎన్నో విజయాలు సాధించడంలో చంద్రబాబు నాయుడు పాత్ర ఎనలేనిదన్నారు. భవిష్యత్తు కోసం రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటుకు కృషి చేయడం, ఆర్సెలర్, రిలయన్స్, మిట్టల్, బీపీసీఎల్ రిఫైనరీ, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి మల్టీనేషనల్ కంపెనీలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి రాబోయేతరాలకు స్ఫూర్తిదాయకం అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 దేశానికి ఆదర్శకగా నిలిచిపోతుందని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కోడెలతో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కోడెల గుర్తుకు వస్తే మొదట గుర్తుకు వచ్చేది ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి అని, ఎన్టీఆర్ కోడెలపై ఉంచిన నమ్మకం కోసం, ఆసుపత్రి అభివృద్ధి కోసం కోడెల ఎన్నో వ్యయప్రయాసలకోర్చి లక్షల మంది జీవితాలలో వెలుగులు నింపిన విషయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో గొంది శ్రీనివాస్, అనిల్ పోట్లూరి, కృష్ణప్రసాద్, సూర్య, రాఘవ, సురేష్, గోపి, చంద్ర, సతీష్, గౌతమ్ చంద్రు, సునీల్, తారక్, వెంకట్, బోపేష్ ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు, తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్ణాహుతి


హోమంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మక్కెన తదితరులు

వినుకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అతి పురాతనమైన కొండమెట్ల వద్ద ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 14రోజుల పాటు నవరాత్రుల కార్యక్రమం చివరి రోజు ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఒంగోలు జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగశీను రాయల్, ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి నిశంకర్ శ్రీనివాసరావు, మహిళా సేవకులు ఉష, ఏటుకూరి కృష్ణవేణి, తిరువాయిపాటి సరోజనమ్మ, విడతల రమ, పత్తి భ్రమరాంబ, పెరవల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళాలు అందజేస్తున్న దాతలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని కోట బజార్ పులుపులవారి వీధిలో ఉన్న వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి అర్వపల్లి ఫణి కుమార్, అర్వపల్లి ఉమాశంకరులు రూ.3,01,116లు విరాళంగా అందజేశారని కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. వీరు 12వ స్తంభం నిర్మాణానికి ఈ విరాళం అందజేశారన్నారు. అదేవిధంగా వర్రా నరసింహులు జ్ఞాపకార్థం భార్య సావిత్రమ్మ రూ.51,116లు, అర్వపల్లి సాంబశివరావు ధర్మపత్ని వెంకట విజయలక్ష్మి రూ.25,116లు విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పులుపుల రాము, వనమా సాంబశివరావు, వనమా కృష్ణ, కోవూరు శివశ్రీనుబాబు, గజవల్లి మురళి, బత్తుల విష్ణు, పోతురాజు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చేతిరాత పోటీలలో వినుకొండ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో సీతారామయ్య

వినుకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన స్వస్తిక్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ అండ్ వెల్ఫేర్ ట్రస్ట్ వారు ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ హ్యాండ్ రైటింగ్ పోటీలలో వినుకొండకు చెందిన విద్యార్థులు పలు విభాగాలలో బహుమతులను సాధించినట్లు చేతిరాత నిపుణుడు సోమేపల్లి వెంకట సీతారామయ్య ఆదివారం తెలియజేశారు. ప్రింట్ హ్యాండ్ రైటింగ్ కేటగిరి-సి విభాగంలో వినుకొండలోని గుడ్ షెపర్డ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న యస్. అన్విత ప్రథమ బహుమతిని, గుడ్ షెపర్డ్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న యస్. ఆకాంక్ష ద్వితీయ బహుమతిని సాధించారన్నారు. ప్రింట్ హ్యాండ్ రైటింగ్ కేటగిరి-బి విభాగంలో గీతమ్స్‌లో 6వ తరగతి చదువుతున్న సీహెచ్.సాయి అవంతిక, ఇంగ్లీషు ఆర్టిస్టిక్ పేరాగ్రాఫ్ విభాగంలో సంసిద్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న గర్రె షణ్ముఖి ప్రథమ బహుమతి సాధించినట్లు వివరించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నరసరావుపేటలో 9వ తరగతి చదువుతున్న పొట్టి అక్షర కర్సివ్ రైటింగ్, కేటగిరి-సి విభాగంలో తృతీయ బహుమతిని సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు, పలువురు పెద్దలు విద్యార్థులను అభినందించారు.

కొత్తపాలెం మాజీ సర్పంచ్ గురవయ్య మృతి


పల్నాటి గురవయ్య (ఫైల్)

యడ్లపాడు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పల్నాటి గురవయ్య (60) అనారోగ్యంతో మృతిచెందారు. గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురవయ్య శనివారం రాత్రి మృతిచెందాడు. 2001-2006 మధ్య కాలంలో ఆయన కొత్తపాలెం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎమ్మెల్సీ రాజశేఖర్ గురవయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ పోటీల ఎంపికలు


ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో జఫ్రుల్లా

వినుకొండటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలం స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు, మండల జట్ల ఎంపికలు ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జఫ్రుల్లా తెలిపారు. పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలోని జడ్పీహెచ్ పాఠశాలలోని ఆట స్థలాన్ని ఆదివారం ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7, 8 తేదీల్లో అండర్- 14, అండర్-17 విభాగాలలో బాల బాలికలకు కబడ్డీ, ఖో ఖో, బాడ్మింటన్, వాలీబాల్, చెస్, యోగ, అథ్లెటిక్స్‌లో మండల పోటీలు, మండల ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఇక్కడ ఎంపికైన మండల జట్లు ఈ నెలాఖరులో జరిగే డివిజనల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం వీరప్పయ్య మాట్లాడుతూ ఈ పోటీలను, పాఠశాలలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన కన్వీనర్ నాగశ్రీనురాయల్, యార్లగడ్డ లెనిన్, ఎంఈవో జఫ్రుల్లా, సురేష్, గంగినేని రాఘవలు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో వివిధ పాఠశాలల నుంచి 800మంది బాల బాలికలు పాల్గొంటారని, ఈ పోటీలకు మండల కో ఆర్డినేటర్‌గా పీడీ వీరాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పీడీ రాధాకృష్ణ మూర్తిలు నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో పీఈటీలు, మద్దం వెంకటేశ్వర్లు, జోనా నాయక్, కొండలు, వెంకటేష్, అశోక్, ఎంఆర్‌సీ కంప్యూటర్ ఆపరేటర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

240 మందికి గుడ్డ చేతి సంచుల పంపిణీ

చిలకలూరిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌత్రా సెంటర్లో ఆంజనేయస్వామి గుడి వద్ద స్థానిక వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 240మందికి గుడ్డ చేతి సంచులు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 15మందికి పైగా క్లబ్ సభ్యులు కార్యక్రమంలో భాగస్వాములై సేవలందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అయితా వెంకటప్రసాద్, కార్యదర్శి కొత్తమాసు పూర్ణచంద్రరావు, కోశాధికారి శనగపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


క్లాత్ హ్యాండ్ బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయాలి

వినుకొండటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని పేదప్రజలకు ఇళ్లపట్టాలు, ఇళ్లస్థలాలు మం జూరు చేయాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు 20సంవత్సరాల నుంచి నివాసాలు ఏర్పాటుచేసుకొని పట్టాలు లేక చాలామంది పేదలు పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. పట్టణంలోని మార్టిన్ కాలనీ, సుందరయ్యనగర్ కాలనీ, వెన్నపూసల కాలనీ, నాగిరెడ్డిపల్లి కాలనీలలో దాదాపు 2500 మంది పేదలు నివసిస్తున్నారని చెప్పారు. దీంతోపాటు అనేక మంది అనేకమంది అద్దెఇళ్లలో ఉంటూ ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మండలంలో అనేక గ్రామాల్లో అగ్రహారం భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని, అదేవిధంగా పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని సమస్య పరిష్కరించాలని పట్టణ కార్యదర్శి బొంగురు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు సరైన వైద్యం అందించాలని సక్రమంగా, పూర్తిగా డాక్టర్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కే శివరామకృష్ణ, పెనుమాల వెంకటేశ్వర్లు, తిరుమల లక్ష్మి, ఎస్‌కే రంజాన్‌బీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు